# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు.**

**2. తెలంగాణలోని హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు.**

**3. యువత మాదకద్రవ్య రహిత జీవనశైలిని అలవరచుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.**

**4. రాష్ట్రంలో రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి రానుంది.**

**5. రాష్ట్రంలో పలుచోట్ల ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

============================

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఈరోజు ఉదయం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టిటిడి అధికారులు కేంద్రమంత్రికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శ్రీ వెంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలను టిటిడి అధికారులు కేంద్రమంత్రికి అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మురుగన్ మాట్లాడుతూ, దేశ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ వెంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ గా దేశం అభివృద్ధి చెందనుందని చెబుతూ...

వాయిస్ ( 28 సెకన్లు)

కాగా ఈ మధ్యాహ్నం తిరుపతిలోని ఆకాశవాణి కేంద్రంలో పత్రికా సమాచార కార్యాలయం – పిఐబి, దూరదర్శన్, ఆకాశవాణి అధికారులతో కేంద్రమంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చిస్తున్నారు. రేపు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో కేంద్రమంత్రి పర్యటించనున్నారు.

----------------------------

తెలుగు ప్రజల అభివృద్ధికి ఉభయ రాష్ట్రాల ప్రభుత్వాలు కృషి చేస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా

చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి జూబ్లీ హిల్స్ నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు నాయుడుని తెలుగు దేశం పార్టీ నాయకులు సన్మానించారు. అనంతరం తెలంగాణ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు రెండు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

---------------------------

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, మాదకద్రవ్య రహిత జీవనశైలిని అలవరచుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విజయవాడలో నిర్వహించిన వాక్ థాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల ఉత్పత్తి, సరఫరాను పూర్తిగా నియంత్రిస్తామని చెప్పారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం అవసరమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నిన్న నెల్లూరులో మంత్రి రామనారాయణరెడ్డితో పాటు జిల్లాకు చెందిన , పలువురు ప్రజాప్రతినిధులతో, అధికారులు మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి అందరం సమన్వయంతో కృషి చేస్తామన్నారు. నియోజకవర్గాల్లోని సమస్యలపై స్థానిక శాసనసభ్యులతో చర్చించి, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఒడిశా రాష్ట్రంలోని ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ రథయాత్ర ఈ రోజు జరగనుంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర రథయాత్ర ద్వారా గుండిచా మందిరానికి చేరుకోనున్నారు. 3 కి.మీ దూరం సాగే ఈ రథయాత్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 1971 తర్వాత జగన్నాథ నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర ఒకేరోజు నిర్వహించడం ఇదే తొలిసారి. జగన్నాథ రథయాత్ర ఉత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో పూరీ క్షేత్రం జన సంద్రంగా మారింది. కాగా ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారు. నాలుగు రోజుల ఒడిశా పర్యటన నిమిత్తం నిన్న సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భువనేశ్వర్‌కు చేరుకున్నారు. రాష్ట్రపతికి ఒడిస్సా గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఇతర ఉన్నతాధికారులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

---------------------------

బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు శిక్షలు పడేలా నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అన్నారు. అనంతపురం జిల్లా కోర్టులో నూతన నేర చట్టాలపై అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ... నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలన్నారు. కక్షిదారులకు న్యాయం దక్కేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు

-------------------------

రాష్ట్రంలో రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి రానుంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు ఉచిత ఇసుక విధానానికి సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ప్రభుత్వం ఎటువంటి రాబడి తీసుకోకుండా నిర్వహణ ఖర్చులు, మాత్రమే వసూలుచేసి ప్రజలకు అందజేయనుంది. ఉచిత ఇసుక అమలు విధానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిన్న రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు దృశ్య మాధ్యమం విధానంలో దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల్లో ఎంత ఇసుక అందుబాటులో ఉందో కలెక్టర్లు అంచనా వేయాలని సూచించారు. అలాగే కలెక్టర్లు జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేయకుండా, నిల్వ కేంద్రాల నుంచి తీసుకున్నది అక్రమంగా విక్రయాలు జరపకుండా ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు.

-------------------------

స్వాతంత్ర సమరయోధులు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి జయంతి ఉత్సవ వేడుకలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ, పాలకొల్లులో విద్యా వ్యాప్తి కోసం అద్దేపల్లి కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో మున్సిపల్ చైర్మన్‌గా అద్దేపల్లి సత్యనారాయణమూర్తి క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా తీర్మానం చేశారన్నారు.

-------------------------

పశ్చిమ గోదావరి జిల్లాలో పంట కాల్వలకు సంబంధించిన పనులను వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నిన్న పాలకొల్లులో వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో మురుగునీరు, పంట కాల్వలకు సంబంధించి నిర్మాణ పనులను చేయడానికి టెండర్ల ప్రక్రియ పూర్తయినందున తదుపరి కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.

-------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 23 సెకన్లు...

-------------------------

ఐదు మ్యాచ్‌ల క్రికెట్ టీ 20 సిరీస్ లో భాగంగా జింబాబ్వేలోని హరారే వేదికగా ఈరోజు సాయంత్రం భారత్ – జింబాబ్వే జట్ల మధ్య రెండో మ్యాచ్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం మ్యాచ్ సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది. కాగా నిన్న జరిగిన మొదటి మ్యాచ్ లో 13 పరుగుల తేడాతో భారత జట్టుపై జింబాబ్వే జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. అనంతరం 116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు 19.5 ఓవర్లలో 102 పరుగులను చేయగా 13 పరుగుల తేడాతో జింబాబ్వే జట్టు విజయం సాధించింది. ప్రస్తుత సిరీస్‌లో జింబాబ్వే జట్టు 1–0 ఆధిక్యంలో కొనసాగుతోంది.

====================